# ఆ వెంబడి

హారర్ స్టోరీ



బత్తుల వెంకటదుర్గా ప్రసాద్

సెల్ 'వైబ్రేషన్స్'తో బైక్ నాపి ఒక పక్కగా నిలిచాడు రవిచంద్ర.

''హలో'' అన్నాడు- ఆ 'ఇన్ కమింగ్ నెంబరు' ఎవరిదై ఉంటుందో అన్న మీమాంసతో.

అటు... ఆడ గొంతు... విని మరింత ఆశ్చర్య పడ్డాడు.

''హలో'' అన్నాడు మళ్ళీ.

''మోర్నింగ్ వింద్రా'' అటు ఆమె తిరిగి అంది.

''ఎవరు'' అనడగ్గలిగాడు రవిచంద్ర.

''జస్ట్ షటప్'' అంది అటు ఆమె.

అంతలోనే గలగలా నవ్వింది.

''ఏమిటీ... ఎందుకా నవ్వు.''

''లేకపోతే... నా గొంతు...

అందులో నా 'పలకరింపు'... విని... 'ఎవరూ' అంటావేమిటీ'' అంది ఆమె మరికాస్తా చిరాగ్గా.

ఆ వెంటనే, ''ఫోజా'' అంది.



రవిచంద్ర తడబడుతున్నాడు.

'వింద్రా!..... అలా నన్ను పిలిచేది... ఒక్కరే..... ఆ ఒక్కరు... యస్పీఆర్? కదా!' అనుకున్నాడు లో గొంతుతో, అప్పుడే.

''నువ్వు రవిచంద్రవే కదూ'' అటు నుండి చటుక్కున ప్రశ్న దూసుకు వచ్చింది.

''అవును.'' అన్నాడు రవిచంద్ర చిన్నగా కదిలి.

''మరి... ఏం ఒళ్ళు ఎలా ఉంది. ఇంతకీ ఎక్కడ ఉన్నావు?'' అటు ఆమె గబగబా మాట్లాడుతోంది.

రవిచంద్ర మాట్లాడలేక పోతున్నాడు.

''గోలగా ఉంది. దార్లో ఉన్నట్టు ఉన్నావు. త్వరగా... నేరుగా రా ఇక్కడకు.'' చెప్పింది ఆమె.

''ఎక్కడకు'' అయోమయంలో పడ్డాడు రవిచంద్ర.

''ఈ రోజు నీకు ఏమైంది. నువ్వేగా షార్పు టెన్నో క్లాక్‌కి ఇక్కడ నన్ను వచ్చి కలుస్తానని చెప్పి, నన్ను ఇక్కడకు వచ్చి ఉండమన్నావు. పావుగంట నుండి వేచి ఉన్నాను....''

''ఎవరండి మీరూ?'' ఎట్టకేలకు అడిగాడు రవిచంద్ర.

''మీరూ! బాబోయ్. అదెవతి? నేను కాక మరో గర్ల్ ఫ్రెండా నీకు.'' దబాయింపుగా ఉంది అటు ఆమె గొంతు.

''ఆс... ఒట్టు... నాకు గర్ల్ ఫ్రెండ్స్ అస్సలు లేరు.

మీరు ఎవరో తెలీయడం లేదు.'' చెప్పాడు రవిచంద్ర.

''మరి నేనెవరైతే? నీకు ఈ రోజు ఏం పట్టింది!'' రుసరుస లాడుతోంది అటు ఆమె.

''ముందు మీరు ఎవరో చెప్పండి.'' విసురుగా అడిగాడు రవిచంద్ర.

'ఎవరీమె! ఎందుకిలా ఆట పట్టిస్తోంది?- ఆట... పట్టించడం... అవును... ఇలా నన్ను ఆట పట్టించేది... ఒక్కరే... ఆ ఒక్కరు... యస్పీఆర్? అవును... వాడే... అంతే...' అనుకున్నాడు, వెంటనే.

''హేయ్ ఇక చాల్లే నీ పోకిరీ తనం. రా త్వరగా... ఇంట్లో అబద్ధమాడి మరీ నీ మాట కొట్టలేక వచ్చి ఉన్నాను ఇక్కడ.''- అటు ఆమె గొంతు చాలా హస్కీగా ఉంది.

రవిచంద్ర అస్తిమితంగా కదులుతున్నాడు.

''హలో, లైన్లో ఉండీ మాట్లాడవేం. మరి నీకు ఇష్టమైన మెరూన్ కలర్ డ్రస్సు... అదే... గత మండే వేసుకున్నాను.. అప్పుడు 'రెడ్‌రోజ్' లా ఉన్నానని నువ్వు పొగడ్తల్లో ముంచేశావు... ఆc. ఆ డ్రస్సే... ఇప్పుడూ వేసుకు వచ్చాను. రా.'' అంది అటు ఆమె చాలా చాలా కొంటెగా.

రవిచంద్ర ఏమీ చెప్పలేక పోతున్నాడు. అలా అని లైన్ కట్ చేయాలనీ లేదు అతడికి. అతడిలో ఏదో కుతూహలం!

'ఆమె ఎక్కడ ఉందో తెలియాలి. ఎలా తెలుసుకోవాలి' అనుకున్నాడు రవిచంద్ర మెల్లగా... సడన్‌గా.

''నువ్వే ఇక్కడకు వచ్చేయ కూడదూ'' అనేశాడు ఆమెతో, గబుక్కున.

''అమ్మయ్య, దార్లో కొచ్చావా? ఆ పట్టింది ఎతో వదిలించుకున్నావా! సరే, ఏంటి కతా? ఇక్కడ నన్ను ఉండమని చెప్పి, ఇప్పుడు అక్కడకు రమ్మంటున్నావేమిటి? ఆ పట్టింది పూర్తిగా వదిలించుకోలేదేం.. తమాషాలా...'' అంది అటు ఆమె చిలిపిగా.

''ప్లీజ్. ఇక్కడకురా.'' అని అనగలిగాడు రవిచంద్ర.

''కుదరదు. నువ్వే రా ఇక్కడకు.'' చెప్పింది అటు ఆమె.

''ఎక్కడకు'' గబుక్కున అడిగాడు రవిచంద్ర.

''అదే... ఎక్కడ ఉన్నావో... చె...ప్పు....'' తమాయించుకుంటూ తిరిగి అడిగాడు.

''ఆc.. శ్మశానంలో.'' చెప్పింది అటు ఆమె చటుక్కున.

అదిరాడు రవిచంద్ర నిజంగా.

''హలో'' ఆగి అంది అటు ఆమె. వెంటనే గబగబా నవ్వింది.

తికమకపడుతున్నాడు రవిచంద్ర.

''హలో రవిచంద్ర గారూ'' అటు ఆమె మృదువుగా పిలుస్తోంది.

తేరుకుంటున్నాడు రవిచంద్ర. ''యస్. చెప్పండి.'' అన్నాడు సాధ్యమైనంత మేరకు సాఫీగా.

''కూల్ అవ్వండి సార్. ఇది మా ఎఫ్‌యం రేడియో ప్రోగ్రాం అండీ. నేను రేడియో జాకీని.'' చెప్పింది అటు ఆమె.

''వ్వాట్'' విదిలించుకుంటున్నట్టు అన్నాడు రవిచంద్ర.

''యస్సార్. జెస్టు ఫన్. మీ సెల్ నెంబరు ఇచ్చింది... మిమ్మల్ని ఇలా ఆట పట్టించమన్నది... మీ యస్పీఆర్...''

''యస్పీఆర్....'' అన్నాడు రవిచంద్ర చాలా విస్మయంగా.

''అవును. మీ యస్పీఆర్. నిజంగా వారు గొప్ప కొంటెవారు.... చిలిపి వారు... వారితో ఫోన్‌లో మాట్లాడుతూంటే చాలా చాలా హాయిగా కాలం గడిచింది...''

''వాడు మీతో ఫోన్‌లో మాట్లాడేడా... ఎప్పుడు?'' భళ్లున అడిగాడు రవిచంద్ర.

''నిన్న'' చెప్పింది అటు ఆమె. వెంటనే, ''ఒకే. బై. సార్.'' లైన్ కట్ చేసేసింది.

''నిన్నా'' అంటూ.. రవిచంద్ర ఉక్కిరి బిక్కిరయి పోతున్నాడు.

''యస్పీఆర్... వాడు... వాడు... చనిపోయాడు కదా!.... నిన్ననే వాడి తొలి 'సంవత్సరీకం' కూడా అయ్యిందిగా.... ' గుణగుడుగా అనుకుంటున్నాడు.

ఆ జాకీతో మాట్లాడడానికి ప్రయత్నించాడు రవిచంద్ర ఎందుకో?

అటు నుండి – 'ఈ... నెంబరుకు ఇన్ కమింగ్ కాల్ సదుపాయం అందుబాటులో లేదు...' అని వినిపిస్తోంది, మళ్ళీ మళ్ళీ.

ఆ వెంబడి-

కోలుకోలేక పోతూన్న....

ర....వి...చం...ద...ర....

*


చిరునామా:
బత్తుల వెంకటదుర్గా ప్రసాద్
**14-7-2,** హెడ్ పోస్ట్ ఆఫీస్ స్ట్రీట్,
(బెలగమ్), పార్వతీపురం- **535 501.**
విజయనగరం జిల్లా.
సెల్: **9701568568**


## www.ఆత్మహత్య.com

బిర్ర బిగిసిన గొంతు మాటల్ని పూడ్చేస్తే ఇక నుదుటిపై చావు సంతకమే!
పిట్టరెక్క సగం గూట్లో ఉండగానే విరిగిపడ్డ అలికిడికి
కాలం, కన్న పేగును మెలితిప్పేస్తుంది
విస్తరించాల్సిన జీవితం ముళ్ళకంచె పాలైనప్పుడు
వీడలేని బంధాలేవో అస్పష్టంగా మమతల్ని స్పృశిస్తూ అలమటిస్తుంటాయి
పురుగులా మెదణ్ణి తొలిచిన ఒక అనాలోచిత చర్య
బుసలుకొట్టే పురుగుమందై కాటేస్తుంది
కసుగాయల్లాంటి షేర్లను పండించలేని అసమర్థత పండి....
తెల్లవార్లూ చదివినా ఉపాధి తెల్లవారి...
పగబట్టిన అభద్రత వెర్రితలలకు తలవంచి....
దౌర్బల్యం కింద నలిగిన మనసుపై బలహీనక్షణం అత్యాచారం
www. ఆత్మహత్య. com
నేడు యువరక్తాన్ని మృత్యుప్రవాహంలో పరవళ్ళు తొక్కించే వెబ్సైట్
క్షణంలో ఆవిరయ్యే జీవితాల వివరాలు
పల్లవించని పాటల గొంతుల ఆడమ్స్ ఆపిళ్ళను కసుక్కున తుంచే తీరుతెన్నులు
మొదలవ్వని పరుగుపందేల్లో కాళ్ళు విరగ్గొట్టుకొని కూలబడే వికృత చర్యలు
ఎక్కడో కాదు.... ఇక్కడే ఒక్క క్లిక్‌తోనే సాధ్యం



ఎంతపని చేస్తున్నావే ప్రేమా?
నిన్నే నెత్తిన పెట్టుకొని ఊరేగేవారంతా ఊరేగిపోతున్నారు
నిన్ను పండించుకోలేని అసమర్థ కృషీవలులై జీవితాల్ని జలజలా రాల్చేసుకొంటున్నారు
చదువూ చదువూ... ఎందుకమ్మా స్పర్ధల్ని గుండెల్లో నాటుతున్నావు
కట్టె మంటల్లో కాలిపోయాక 'విత్తు' విత్తు చిగిర్చేనా చెప్పు?
విచ్చుకుంటున్న మొగ్గ పేగుల్ని తుంచేస్తూ
టీవీలకొద్దీ..... నెట్లకొద్దీ... పేపర్లకొద్దీ... పురుళ్ళని ఎన్నాళ్లు పోయడం?

ముగిసిపోతున్న జీవితాల సాక్షిగా
గరళపునురుగుల పెదవులు.. బోదకాళ్ళయిన గొంతులు... పట్టాలపై తప్పుతున్న జీవితాలు
ఈ పాపం ఎవరిదో తేల్చమని
ఒత్తిడితో పరచుకొన్న లోకాన్ని నిలదీసే లోపే
బుడగను గాలి వీడిన చప్పుడు...

-అద్దంకి శ్రీనివాస్